

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): జలాశయంలో సోమవారం సాయంత్రానికి 26.901 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 90.747 మీటర్ల నీటి మట్టం ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,580
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,440
3శాతం జీఎస్టీతో	రూ.5,603
సవర (8గ్రా)	రూ.44,824

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3 /26.4

సోమవారం గాలిలో తేమ 59 శాతం ఉంది. మంగళవారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూద్దాం

• ఎస్పీ డాక్టర్ కె. తిరుమలేశ్వరరెడ్డి



బాధితురాలి సమస్యను వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): బాధితులు అందించే ప్రతి వినతిపత్రాన్నీ నిర్ణీత గడువు లోపు పరిష్కరించి వారికి సత్వర న్యాయం జరిగేలా చూద్దామని ఎస్పీ డాక్టర్ కె. తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్రా మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన 'స్పందన' కార్యక్రమంలో 106 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి సమర్పించారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే స్పందన వినతులపై సత్వర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సైబర్‌నేరాలు, ఉద్యోగాల పేరిట నేరాలు, చిట్టీలు, ఆర్థిక నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మిస్సింగ్, కిడ్నాప్, లైంగికదాడి, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్పందన వినతుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్, డీటీసీ డీఎస్పీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీపై టమాటాల విక్రయం

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ఫత్తేఖాన్‌పేట, నవాబుపేట రైతుబజార్లలో మంగళవారం నుంచి సబ్సిడీపై టమాటాలు విక్రయిస్తామని జిల్లా వ్యవసాయశాఖ మార్కెటింగ్ ఏడీ అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా కావలి, కందుకూరు రైతుబజార్లలో బుధవారం నుంచి సబ్సిడీపై టమాటాలు విక్రయిస్తామని తెలిపారు.

జిల్లా అర్చక గ్రీవెన్స్ రేపు

నెల్లూరు(బృందావనం): దేవదాయ, ధర్మదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అర్చకుల సమస్యలకు సంబంధించి బుధవారం 'అర్చక గ్రీవెన్స్' జరుగనుందని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీపీపీ ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు సోమవారం తెలిపారు. ఈ అర్చక గ్రీవెన్స్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీసర్వోదయ కళాశాలలో మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ అర్చక గ్రీవెన్స్‌లో దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు, అర్చక సమాఖ్య నేతలు పాల్గొంటారన్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు అనునిత్యం నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిరాధార ఆరోపణలు చేయడంపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వలంటీర్లతోపాటు ప్రజాప్రతినిధులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, సామాన్య ప్రజలు పవన్ కళ్యాణ్‌పై మండిపడుతున్నారు. వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మలు దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పవన్ కళ్యాణ్‌పై ప్రజాగ్రహం



జనసేన అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు, ప్రజాప్రతినిధులు

వలంటీర్లపై వివాదాస్పద ఆరోపణలు చేసిన జనసేన అధ్యక్షుడు

- క్షమాపణలు చెప్పాలంటూ వలంటీర్లు, ప్రజాప్రతినిధుల డిమాండ్
- దిష్టిబొమ్మలు దహనం చేసి నిరసనలు
- పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలంటూ వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు నగర నియోజకవర్గంలోని గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. పవన్ కళ్యాణ్ బ్యానర్‌ను దహనం చేశారు. ఈ ర్యాలీకి డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, నగర నియోజకవర్గ కార్పొరేటర్లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌తోపాటు కార్పొరేటర్ వేలూరు మహేష్ మాట్లాడుతూ వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. కరోనా, విపత్తుల సమయాల్లోనూ వలంటీర్లు ముందుండి ప్రజా సేవ చేశారని, అలాంటి వారిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దగదర్తిలో..

దగదర్తి(కావలి): వలంటీర్ వ్యవస్థపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మండల కేంద్రం దగదర్తిలో సోమవారం వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ చిత్రపటాలను దహనం చేశారు. ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు వలంటీర్లు సమాచారం ఇస్తున్నారన్న పవన్ కళ్యాణ్ వివాదాస్పద ఆరోపణలకు వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పవన్ కళ్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ వలంటీర్ల వల్లే హ్యూమన్ ట్రాఫికింగ్ జరుగుతుందనడం దుర్మార్గమన్నారు.

దిష్టిబొమ్మ దహనం

బిట్రగుంట: సంక్షేమ పథకాలను పేదలకు చేరువ చేస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వాఖ్యలపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమవుతోంది. పవన్ క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేస్తూ బోగోలు ప్రధాన కూడలిలో వలంటీర్లు సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు.

వలంటీర్ల ఫిర్యాదు

కందుకూరు: వలంటీర్లపై అసత్య ఆరోపణలు చేసిన పవన్ కళ్యాణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వలంటీర్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ ఎస్సై హనీఫ్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవ చేసే వారిని మానసికంగా దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే పవన్ కళ్యాణ్ తమపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే క్షమాపణలు చెప్పాలని, లేదంటే రాష్ట్రంలో ఉన్న 3 లక్షల మంది వలంటీర్లు పవన్ కళ్యాణ్‌కు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

గుడ్లూరులో నిరసన

గుడ్లూరు: వలంటీర్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆ మండలంలోని వలంటీర్లు సోమవారం ఫిర్యాదు చేశారు. తమ నిస్వార్థ సేవలను చూసి ఓర్వలేని పవన్ కళ్యాణ్ వలంటీర్లు మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని ఎస్సై ప్రసాదరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

కరటంపాడులో..

ఆత్మకూరురూరల్: వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆత్మకూరు రూరల్‌లోని వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కరటంపాడులో జనసేన పార్టీ జెండాలను, పవన్ కళ్యాణ్ ఫొటోలను దహనం చేసిన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు పఠాన్ నసీమా, బీబీజాన్, శ్రావణి, మౌలాలి, ఈశ్వరి, విజయ్‌కుమార్, మైనార్టీ నాయకుడు పఠాన్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



కావలి: పోలీసుకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు



గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో పవన్‌కళ్యాణ్‌పై ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

దిష్టిబొమ్మ దహనం



నెల్లూరు నగరంలో పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న వలంటీర్లు

నెల్లూరు రూరల్: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను నెల్లూరు రూరల్ పరిధిలోని బుజబుజనెల్లూరులో సోమవారం స్థానిక వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు దహనం చేశారు. అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ఎంతో శ్రమిస్తున్నారని, వారిని కించపరిచేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రంగనాథుని ఆలయంలో ఏసీబీ తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఏసీబీ డీఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఇన్‌స్పెక్టర్లు రమేష్‌బాబు, వేణు, జీఎల్ శ్రీనివాసరావు, కిరణ్‌లు తమ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడ్డారు. ఆలయానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలు, భక్తులు సమర్పించిన వస్త్రాలు, మొక్కులకు సంబంధించిన వివరాలు, స్వామి వారి ధూప, దీప, నైవేద్య ఖర్చులు, శానిటేషన్, లీజు తదితరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. ఉదయం ప్రారంభమైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగాయి. ప్రతి రికార్డును అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మంగళవారం కూడా తనిఖీలు కొనసాగనున్నట్లు సమాచారం. రంగనాథుని ఆలయ నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

15న కారుణ్య నియామక దరఖాస్తుల పరిశీలన

నెల్లూరు సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ 2020 జనవరి 1వ తేదీ తర్వాత మృతిచెందిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా కండక్టర్, అసిస్టెంట్ మెకానిక్ పోస్టుల భర్తీకి సంబంధించి అందిన దరఖాస్తులను ఈ నెల 15వ తేదీన పరిశీలించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పీవీ శేషయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30లకు నగరంలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో జరిగే దరఖాస్తుల పరిశీలనకు అభ్యర్థులు హాజరుకావాలని తెలిపారు. హాజరు కాని వారు ఉద్యోగావకాశం కోల్పోవడంతోపాటు భవిష్యత్‌లో వారికి కారుణ్య నియామకానికి అర్హత ఉండదని స్పష్టం చేశారు.

ఊరెళ్లారు.. ఇల్లు కొల్లగొట్టారు

• రూ.11 లక్షల సొత్తు చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇల్లు కొల్లగొట్టారు. రూ.11 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. వివరాలు.. నగరంలోని టీచర్స్‌కాలనీ రెండో వీధిలో పి.ప్రసూన తన చిన్న కుమార్తెతో కలిసి నివాసం ఉంటోంది. ఈ నెల 8వ తేదీ రాత్రి ఆమె తన కుమార్తెతో కలిసి దైవదర్శనం కోసం శ్రీశైలం వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి గ్రిల్స్ తాళాలు, మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్‌రూమ్ తాళాలు పగలగొట్టి బీరువాలోని రూ.11 లక్షల విలువ చేసే సుమారు 40 సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. సోమవారం నెల్లూరుకు చేరుకున్న ప్రసూన, ఆమె కుమార్తె ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్‌రూమ్‌లోని ర్యాక్‌లోని డబ్బాలో వేసిన తాళాలు డ్రస్సింగ్ టేబుల్ మీద ఉన్నాయి. బీరువాను తెరచి చూడగా అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలి ముద్రలను సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో టీడీపీ నేత నారా లోకేశ్ రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ నవ్వుల పాలవుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం అన్నదాతల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. సబ్సిడీలను అందిస్తూ అండగా నిలుస్తుంటే లోకేశ్ మాత్రం ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం బకాయిలు ఉందని, రవాణా చార్జీలు చెల్లించలేదంటూ మాట్లాడారు. ఆయన మాటల్లో వాస్తవం లేదు. అసలు జరిగిదేంటో పరిశీలిస్తే రైతులకు ఎక్కడా ధాన్యం బకాయిలు లేవని, రవాణా చార్జీలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే లోకేశ్ మాటలన్నీ అబద్ధాలని స్పష్టమవుతోంది.

ధాన్యానికి అధిక ధరలు

పుట్టి రూ.18 వేలకు పైగా ధరతో కొనుగోలు

- బహిరంగ మార్కెట్‌లోనూ అధిక ధరలు
- ధాన్యం నగదు రైతులకు చెల్లించిన ప్రభుత్వం
- బకాయిలు లేకున్నా ప్రభుత్వంపై లోకేశ్ లేనిపోని ఆరోపణలు



రైతులకు నష్టం జరగలేదు



ఈ సీజన్‌లో ధాన్యం పండించిన రైతులకు అధిక ధరలు లభించాయి. ఇతర జిల్లాల నుంచి రైస్ మిల్లర్లను పిలిపించాం. వారు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కన్నా అధిక ధరలకు ధాన్యం కొనుగోలు చేశారు. పుట్టి రూ.18 వేల నుంచి రూ.19 వేలకు పైగా ధరతో కొనుగోలు చేశారు. ధాన్యం విక్రయించిన రైతులకు నగదు పూర్తిస్థాయిలో చెల్లించడం జరిగింది. రూ.50 లక్షలకు పైగా రవాణా చార్జీలు చెల్లించాం. ధాన్యం విక్రయించిన రైతులు నష్టపోలేదు.

– ఆర్.కూర్మనాథ్, జాయింట్ కలెక్టర్

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వాతావరణం, సాగునీటి వనరులు వరిసాగుకు అనుకూలంగా ఉంటాయి. దీంతో ఏటా జిల్లావ్యాప్తంగా సుమారు 6 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తారు. నెల్లూరు ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. దీంతో ప్రతి సీజన్‌లో జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లు, దళారులు, వ్యాపారులు కుమ్మక్కై వరికోతలు ప్రారంభమయ్యే సమయానికి ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుంటారు. పుట్టి ధాన్యం రూ.16 వేలకుపైగా ఉంటే.. రైస్ మిల్లర్లు, దళారులు, వ్యాపారులు ధరలను తగ్గించి రూ.12 వేలు, రూ.11 వేలకు కొనుగోలు చేసేవారు. అయితే ప్రభుత్వం ఈ ఏడాది రబీ సీజన్‌లో సాధారణ రకం ధాన్యం పుట్టి(850 కేజీలు) రూ.17,340గా, గ్రేడ్–ఏ పుట్టి రూ.17,510గా మద్దతు ధర నిర్ణయించింది. ఈ ధర రైతులకు ప్రయోజనకరంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో కూడా పుట్టి ధాన్యం రూ.18 వేల నుంచి రూ.19 వేలకు పైగా ధరతో కొనుగోలు చేయడంతో రైతులకు లాభాలు చేకూరాయే తప్ప ఎలాంటి నష్టం జరగలేదు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరలు అధికంగా ఉండడంతో రైతులు గుంటూరు, ఉభయగోదావరి జిల్లాలు, కడప, కర్నూలు, కృష్ణా తదితర జిల్లాల నుంచి వచ్చిన రైస్ మిల్లర్లు, వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించారు. ధాన్యానికి అధిక ధరలు లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్‌బీకేలు, పీపీసీల(ధాన్యం కొనుగోలు కేంద్రాల) ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు కూడా ప్రభుత్వం ఎలాంటి బకాయిలు లేదు. ధాన్యం విక్రయించిన రైతులకు పూర్తిస్థాయిలో నగదు వారి వారి బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి

జిల్లా యంత్రాంగం కూడా ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. పూర్వపు కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పీపీసీలు ఏర్పాటు చేయకుండా ఇతర జిల్లాల రైస్ మిల్లర్లు, వ్యాపారులను జిల్లాకు పిలిపించారు. ఇతర జిల్లాల రైస్ మిల్లర్లు పుట్టి రూ.18 వేలకు పైగా ధరతో రైతుల నుంచి కొనుగోలు చేశారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న నిర్ణయం వల్ల రైతులు అధిక ధరలకు ధాన్యం విక్రయించారు. దీంతో అన్నదాతలకు ప్రయోజనం చేకూరింది. ఎలాంటి నష్టం జరగలేదు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి అధిక ధరలు ఉండడం వల్ల పీపీసీలు ఏర్పాటు చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు అధికారులను ఒత్తిడి చేయలేదు. ఒకటి రెండు గ్రామాల రైతుల మాత్రమే పీపీసీలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ధాన్యం విక్రయించిన రైతులు ఎక్కడా నష్టపోలేదని జిల్లా యంత్రాంగం చెబుతోంది. ధాన్యం ధరలు తక్కువగా ఉంటే తప్పకుండా రైతులు అధికారులను కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరేవారు. కానీ అలాంటి పరిస్థితి జిల్లాలో లేదు. 2022–23 రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ప్రభుత్వం 4,909 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. కేవలం రూ.10.11 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించింది. ధాన్యం విక్రయించిన 333 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో ధాన్యానికి సంబంధించిన నగదును ప్రభుత్వం జమ చేసింది. ఎవరికీ బకాయిలు లేవు. 2021–22 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి 22,844 మంది రైతుల నుంచి 4,87,695.920 మెట్రిక్ టన్నుల ధాన్యం (రూ.955.80 కోట్ల విలువ) ప్రభుత్వం సేకరించింది. దానికి సంబంధించిన నగదు కూడా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. అయితే ట్రక్ షీట్లు జనరేట్ చేయకుండా డిఫాల్టర్‌గా ఉన్న రైస్‌మిల్లుకు ధాన్యం సరఫరా చేసిన రైతులకు మాత్రమే నగదు జమ కాలేదు. కందుకూరు డివిజన్ వీరేపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు మాత్రమే ట్రక్‌షీట్ జనరేట్ చేయకుండా ధాన్యం రైస్‌మిల్లుకు తరలించారు. ట్రక్‌షీట్ జనరేట్ చేయలేదు కనుక రైతులకు ధాన్యం నగదు జమ కాలేదు. రవాణా చార్జీలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.50 లక్షలకు పైగా నగదు ప్రభుత్వం జమ చేసింది. మిగిలిన రైతులకు సంబంధించి రవాణా చార్జీల నగదును ప్రభుత్వం త్వరలో వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

• జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం'(స్పందన) అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులను సమన్వయం చేసుకుని అర్జీలను నిర్ణీత సయమం లోపు పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చినప్పుడు సకాలంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అవసరమైతే వ్యక్తిగతంగా తనిఖీ చేసి సంతృప్తికరంగా పరిష్కారమార్గం చూపాలన్నారు. అంగన్‌వాడీల కోర్కెల దినోత్సవం సందర్భంగా వారి సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు కె.రవీంద్ర, సౌజన్య, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పవన్.. నీ వ్యాఖ్యలు వెనక్కి తీసుకో..

- రాజకీయ లబ్ధి కోసమే వలంటీర్లపై పవన్ అభాండాలు
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

కొడవలూరు: 'గ్రామ, వార్డు వలంటీర్లు సేవకు మారు పేరు. వారిపై నువ్వు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకో.' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తవంగల్లు మజరా శ్రీనివాసపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే సంక్షేమ వారధులైన వలంటీర్లపై పవన్ ఇష్టానుసారంగా మాట్లాడారని మండిపడ్డారు. వారంతా వేతనం ఆశించకుండా గౌరవ వేతనంతోనే ఎంతో కష్టపడి సేవలందిస్తున్నట్లు చెప్పారు. పవన్ ఏమైనా రాష్ట్ర ముఖ్యమంత్రా.. ఆయనకు నిఘా సంస్థలు ఎందుకు చెబుతాయని ప్రశ్నించారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు సమైక్యంగా పనిచేస్తుంటే ఓర్వలేని పిచ్చి పవన్ ఉద్దేశపూర్వకంగా అభాండాలు మోపుతున్నారని చెప్పారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి రోడ్లపైకి వచ్చి ప్రజలకు అండగా నిలిచారన్నారు. గ్రామాలెలా ఉంటాయో కూడా తెలియని మెంటల్ పవన్ వలంటీర్లను నోటికొచ్చినట్లు మాట్లాడడం దారుణమని ఎమ్మెల్యే అన్నారు.

బీసీలకు పెద్దపీట

బీసీలకు పెద్దపీట వేసింది దివంగత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బీసీలకు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కార్పొరేషన్లు ఇచ్చారో నారా లోకేశ్ తెలుసుకోవాలన్నారు. ఎన్నికలొస్తున్నాయని చినబాబు పాదయాత్ర, దత్తపుత్రుడు వారాహి యాత్రలు చేపట్టి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కావలి నియోజకవర్గంలో లోకేశ్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి పక్షానే ఉన్నారని చెప్పారు. డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ కాగ్ నివేదికపై అవగాహన లేకుండా దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ ఎ.సింధు, ఉప సర్పంచ్ చక్కా శైలజ, ఎంపీటీసీ ఎస్.ప్రసాద్, నాయకులు చక్కా మనోహర్‌బాబు, వేముల వెంకటేశ్వర్లు, శూలం హరిబాబు, మల్యాద్రి, బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్రకు స్పందన కరువు

- వలంటీర్ల సేవల గురించి దత్తపుత్రుడికేం తెలుసు?
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: 'కావలి నియోజకవర్గంలో నారా లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. రూ.500 నుంచి రూ.1,000 వరకు ఇచ్చి తోలేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకుండాపోయింది.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని నార్త్ మోపూర్ గ్రామం ప్రగతినగర్, వడ్డిపాళెం కాలనీల్లో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలను కలిసి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రామిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు చేస్తున్న సేవల గురించి చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌కు ఏమి తెలుసని ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తున్న వారి గురించి ఇష్టానుసారంగా మాట్లాడడం దారుణమన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు అందరికీ గుర్తున్నాయన్నారు. అలాంటి వారి గురించి తప్పుడు వ్యాఖ్యలు చేసిన పవన్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయన్నారు. ఆ కమిటీలు పథకాలను తెలుగు తమ్ముళ్లకే ఇచ్చాయన్నారు. నేడు వలంటీర్లు కుల మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. పథకాలతో నూరుశాతం సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఉస్మాన్, మేడా కృష్ణారెడ్డి, సాధిక్ రెడ్డి, మధురెడ్డి, భాస్కర్, వెంకటరమణయ్య, కొండా చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షలకు 127 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 127 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో సెమిస్టర్ పరీక్షలకు 363 మందికి గానూ 324 మంది హాజరుకాగా, 39 మంది గైర్హాజరయ్యారని తెలియజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షకు 604 మందికి గానూ 516 మంది హాజరుకాగా 88 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


విక్రమ్‌కుమార్ మృతదేహం

పలేటివారిపాలెం: బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కాకుటూరు గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న గదుల్లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బిహార్‌కు చెందిన విక్రమ్‌కుమార్ (20) కొంతకాలంగా జాతీయ రహదారి నిర్మాణంలో కూలీగా పనిచేస్తున్నాడు. అతడికి రెండునెలల క్రితం వివాహమైంది. ఆదివారం రాత్రి భార్యకు ఫోన్ చేశాడని, ఈ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని అతని మిత్రులు చెబుతున్నారు. సోమవారం ఉదయం ఫ్యాక్టరీకి చెందిన సిబ్బంది గది వద్దకు వెళ్లారు. అక్కడ విక్రమ్ కుమార్ చనిపోయి కనిపించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుడ్లూరు సీఐ సుబ్బారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 112
లేయర్ (లైవ్)	: 92
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 220
లేయర్ చికెన్	: 156

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5

జనసేన అధ్యక్షుడి మాటలు బాధాకరం

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి


బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇష్టానుసారంగా మాట్లాడడం బాధాకరమని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 28వ డివిజన్‌లో ఉన్న కేశవులనగర్‌లో సోమవారం గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. వారు ఎంతో బాగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరిస్తున్న వారిపై వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అభివృద్ధి పనులకు త్వరితగతిన నిధులు కేటాయించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లే, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో 36 పోస్టుల భర్తీ


నియామకపత్రం అందజేస్తున్న డీఈఓ

నెల్లూరు(టౌన్): జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశారు. ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్, డెమోలు నిర్వహించి మార్కుల ఆధారంగా అభ్యర్థుల జాబితాను తయారు చేశారు. మొత్తం 42 పోస్టులకు 36 మందిని ఎంపిక చేశారు. సోమవారం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా కేజీబీవీల్లో 36 మందికి పోస్టింగ్‌లు కల్పించారు. డీఈఓ గంగా భవాని చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులు వెంటనే విధుల్లో చేరాలన్నారు. కేజీబీవీల్లో విద్యార్థినులకు ఉత్తమ బోధన అందించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. మిగిలిన ఆరు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో సమగ్రశిక్ష ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గెస్ట్ ఫ్యాకల్టీ ప్రక్రియలో నియామకాలు చేపట్టనున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, జీసీడీఓ మమత, సెక్షన్ అసిస్టెంట్ వేణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాం

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ తెలిపారు. నెల్లూరు నగరంలోని 40వ డివిజన్ మూలాపేటలో ఉన్న కోనేటిమిట్ట, ధర్మరాజ స్వామిగుడి వీధి, పల్లెమిట్ట తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?లేదా? అని ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూలాపేట కోనేరు వద్ద చిన్నచిన్న సమస్యలున్నాయన్నారు. అలాగే శివాలయంలో నుంచి వచ్చే నీరు కోనేరులో చేరి మురుగు అవుతోందని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అందుకు సంబంధించి కోనేరులో నీరు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నగరం పెద్దదిగా ఉన్నప్పుడు కొన్ని సమస్యలు తెలియకుండా ఉండొచ్చని, ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

ఆ మాటలు సిగ్గుచేటు

తాను చిత్తశుద్ధితో దొంతాలిలో తన పాలమే అని ప్రమాణం చేసినా నా పీఏ సాక్షి సంతకం ఉందని అనిల్ అబద్ధపు ప్రమాణం చేశారని ఓ వ్యక్తి మాట్లాడడం సిగ్గుచేటని ఎమ్మెల్యే అన్నారు. తాను అబద్ధపు ప్రమాణం చేస్తే భగవంతుడు చూసుకుంటారని చెప్పారు. అసలు తాను ప్రమాణం చేసినప్పుడు ఏమి మాట్లాడానో కూడా వినకుండా కొందరు ఇష్టానుసారంగా మాట్లాడడం దారుణమన్నారు. తన పాలంలో నా పీఏ సాక్షి సంతకం, నా స్నేహితులు, బంధువుల సంతకం కాకుండా ఇంకెవరి సంతకాలు ఉంటాయని అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, నాయకులు మానికల సునీల్, నూనె ప్రసాద్, కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కనకపట్నం కాదు.. కష్టాల పట్నం

కావలి: కావలిని కనకపట్నంగా మారుస్తారని రెండుసార్లు ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ఆయన కష్టాల పట్నంగా మార్చేశాడని లోకేశ్ విమర్శించారు. యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం రాత్రి కావలిలో బహిరంగ సభ నిర్వహించారు. టీడీపీ అధికారంలో ఉండగా ప్రజాధనాన్ని దోచుకున్న ఇద్దరు వ్యక్తులను పక్కన పెట్టుకుని కావలి ఎమ్మెల్యేపై ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియాగా మార్చేశాడంటూ ఊగిపోతూ ఆరోపణలు చేస్తుంటే సభికులే నవ్వుకున్నారు. ప్రశాంతంగా ఉండే కావలిని రామిరెడ్డి అరాచకాల అడ్డాగా మార్చేశాడని, ఇవన్నీ చూసిన తర్వాత ఆయనకు ముద్దుగా అవినీతి అనకొండ అని పేరు పెడుతున్నానన్నారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 4 ఎకరాల భూమిని అనకొండ బినామీ మురళీరెడ్డి కబ్జా చేశాడని, సెంటు స్థలాలు పేరుతో రూ.100 కోట్లు కుంభకోణం చేశాడంటూ ఆరోపణలు గుప్పించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని కలెక్షన్ సెంటర్‌గా మార్చేసి భూములు కొనాలన్నా, అమ్మాలన్నా అనకొండకు కప్పం కట్టాలన్నారు. లేఅవుట్ వేయాలంటే రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ఎకరాకు వసూలు చేస్తున్నాడని, రోజుకు 300 టిప్పర్లు అక్రమంగా గ్రావెల్ తరలించి దోచుకుంటున్నారని చెప్పారు. బీచ్ ఇసుక పక్క రాష్ట్రాలకు అమ్ముకుంటున్నాడని విమర్శలు చేశాడు. అక్రమాలపై సిట్ ఏర్పాటు చేసి తినిందంతా కక్కిస్తా.. కావలిలో ఉన్నా, కంబోడియాలో ఉన్న పట్టుకొస్తానంటూ ఊగిపోయారు. సభ ప్రారంభం నుంచి సీఎంని సైకో జగన్ అంటూ వ్యాఖ్యానించడాన్ని విన్న ప్రజలు పాపం జగన్ వల్ల వీళ్లకు అధికారం రాదని ఆక్రోశంలా ఉందంటూ చర్చించుకోవడం గమనార్హం.

'పాలనా వ్యవస్థపై వారికి గౌరవం లేదు'

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): పాలనా వ్యవస్థపై కనీస అవగాహన లేకే వలంటీర్లపై కొందరు నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. మర్రిపాడు మండలం డీసీపల్లి సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయరు రూప్‌కుమార్ యాదవ్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పదవీ కాలంలో రూ.2.5 లక్షల కోట్లను ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందజేశారన్నారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమాన్ని చేరవేసిన ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబంలోని సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం ద్వారా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. నిజాయితీగా సేవలందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష నాయకులు ఇష్టానుసారం మాట్లాడి ప్రజల దృష్టిలో దోషులుగా మిగిలారన్నారు. ఓ వైపు టీడీపీ నాయకుడు నారా లోకేశ్ తాము అధికారంలోకి వస్తే ప్రతి 30 ఇళ్లకు వలంటీర్‌ను నియమిస్తామని చెబుతుంటే పవన్ కళ్యాణ్ అజ్ఞానంతో ఆ వ్యవస్థపై నోటికొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు.

సులువుగా డబ్బు సంపాదించాలని..

- చీటింగ్ కేసులో ఒకరి అరెస్ట్
- 35 ఏయిరేటర్ల స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు

గుడ్లూరు: రొయ్యల చెరువుల యజమానుల వద్ద ఏయిరేటర్లు, జనరేటర్లను అద్దెకు తీసుకుని.. ఆ తర్వాత వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్న మహేంద్ర అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కోవూరుకు చెందిన కుండా మహేంద్ర అనే వ్యక్తి రొయ్యల చెరువులు సాగు చేసి ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో రొయ్యల చెరువుల యజమానులను మోసం చేయడం మొదలుపెట్టాడు. కావలి రూరల్, విడవలూరు తీర ప్రాంతాల్లో రొయ్యలు సాగు చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి ఖాళీ సమయాల్లో మీ జనరేటర్లు, ఏయిరేటర్లను ఇస్తే అద్దె చెల్లిస్తానని చెప్పడంతో వారు నమ్మి వాటిని ఇచ్చారు. రెండునెలలపాటు అద్దె చెల్లించిన తర్వాత మహేంద్ర వస్తువులను ఇతర ప్రాంత్రాల్లో అమ్మేశాడు. అద్దెలు, ఏయిరేటర్లు అడిగిన రైతులకు నగదు చెల్లిస్తానని రెండు, మూడునెలలుగా వాయిదాలు వేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడు. మోసపోయామని గ్రహించిన రైతులు ఆయా పోలీస్‌స్టేషన్లలో మహేంద్రపై ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసి..

2022 సంవత్సరంలో మండలంలోని కర్లపాళెం గ్రామానికి చెందిన రొయ్యల చెరువు రైతు కొక్కిల గడ్డ సుబ్రహ్మణ్యం వద్ద మహేంద్ర 40 ఏయిరేటర్లు అద్దెకు తీసుకున్నాడు. అతడికి అద్దె చెల్లిస్తూ కమీషన్ కూడా తీసుకున్నాడు. రెండునెలలపాటు అద్దె చెల్లించిన మహేంద్ర వారికి తెలియకుండా ఇతర ప్రాంతాల్లో ఏయిరేటర్లను అమ్మేశాడు. కొన్నినెలల నుంచి సుబ్రహ్మణ్యం అద్దెతోపాటు జనరేట్లు, ఏరియేటర్లు ఇవ్వాలని మహేంద్రను అడుగుతుండగా తప్పించుకుని తిరుగుతుండటంతో గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఒక్కో ఏయిరేటర్ విలువ రూ.20 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. దీంతో కేసు నమోదు చేసిన సీఐ, ఎస్సై ప్రసాద్ రెడ్డి నిందితుడిని కోవూరులో సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 35 ఏయిరేటర్లను రికవరీ చేశారు. చీటింగ్ కేసు నమోదు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై రాములు పాల్గొన్నారు.